క్లుప్తంగా

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన బాధితుడికి మంజూరైన రూ.2లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్, మైసిగండి మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్ నాయకులు గోపాల్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్ తండ్రి చంద్రునాయక్ సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చేరుకుని మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్‌నాయక్, తులసీరాం, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, పీఏసీ ఎస్ వైస్ చైర్మన్ సత్యం, ఎంపీటీసీ సభ్యుడు లచ్చిరామ్‌నాయక్, ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు రమేశ్ నాయక్, శ్రీను, భీమన్, టీక్‌లాల్, లక్పతినాయక్ తదితరులున్నారు.

ఎస్ఆర్‌పీఎస్ గ్రామ కమిటీ నియామకం

తలకొండపల్లి: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి(ఎస్ఆర్‌పీఎస్) గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కడమంచి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా వారణాసి కుమార్, కోశాధికారిగా సరిగిరి రమేశ్, కార్య వర్గ సభ్యులుగా గణేశ్, శ్రీశైలం, రాము, శివ, భాస్కర్‌లు నియమితులయ్యారు. మండలాధ్యక్షుడు పవన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడు జికుకుంట్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శి వినోద్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీశైలం, రామలింగ, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. సోమవారం ఆమె శ్రీశ్రీ ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

85 మందికి కంటి పరీక్షలు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో కంటి వైద్యులు ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా, లయన్స్‌క్లబ్ సభ్యులు మోహన్‌రెడ్డి, వెంకటయ్య, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో బొడ్రాయి, కోట మైసమ్మ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం బొడ్రాయి, కోట మైసమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, షాద్‌నగర్, ఆమనగల్లు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, వార్డు సభ్యులు రాణి, రాజు, రేణుక, యాదయ్య, కృష్ణవేణి, యాదగిరిగౌడ్, దామోదర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసులు, రాములు, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, నాయకులు చిత్తరంజన్‌దాసు, రాజవర్ధన్‌రెడ్డి, వేద పండితులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడీకి వెళ్లి వచ్చేసరికి చోరీ

ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లిన దుండగులు

ఇబ్రహీంపట్నం రూరల్: షిరిడీ యాత్రకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడ్డారు. ఈ ఘటన ఆదిభట్ల పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన ప్రకారం.. కృష్ణ జిల్లాకు చెందిన గంటసాల నవీన్‌కుమార్ ఆదిబట్ల టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తూ బొంగుళూరులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 9న ఆయన తన స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి షిరిడీ సాయి దర్శనానికి వెళ్లారు. 12న ఉదయం వచ్చి చూసే వరకు ఇంటి తాళం తెరిచి ఉంది. గదిలోకి వెళ్లి పరిశీలించగా ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరేళ్లుగా అద్దె భవనంలోనే..

- మూడేళ్లయినా పూర్తికాని 'కేజీబీవీ' భవన నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

గ్రామీణ ప్రాంతాలలోని వెనుకబడిన వర్గాల పిల్లల్లో బాలికల విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హాస్టల్ వసతి కల్పిస్తూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఏర్పాటు చేశారు. లక్ష్యం బాగానే ఉన్నా.. నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఆరేళ్లుగా అద్దెభవనంలోనే అరకొర వసతుల నడుమ విద్యకొనసాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన పనులు నేటికీ పూర్తవ్వలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



కడ్తాల్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. 2017–18 విద్యా సంవత్సరంలో మండల కేంద్రంలో అద్దె భవనంలో ప్రారంభమైన కేజీబీవీ పాఠశాలకు సొంత భవనం లేక ఆరేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అద్దె భవనంలో మౌలిక వసతులు లేక విద్యార్థినులు ఇరుకు గదుల్లో.. నేలపై కూర్చుని తరగతులు వింటూ విద్యను అభ్యసిస్తున్నారు. 200 మంది విద్యార్థినులు ప్రతీ సంవత్సరం విద్యనభ్యసిస్తుండగా ఎస్ఎస్‌సీలో ప్రతీ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ పాఠశాలలో తొమ్మిది మంది టీచింగ్, ఏడుగురు నాన్‌టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. సరైన ఫర్నీచర్ లేకపోవడంతో నేలపై కూర్చుని చదువులు, వరండాలో భోజనం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూంలు లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కుంటున్నారు. ఆట స్థలం లేక పోవడంతో క్రీడల్లో ప్రావీణ్యం తగ్గే ప్రమాదం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

మరో రెండు నెలలే గడువు

ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాల ఏడాది కాలానికి లీజ్ తీసుకున్నారు. ఒప్పందం ముగియడంతో భవన యజమాని ఖాళీ చేయాలని చెబుతున్నాడు. స్థానిక ప్రజాప్రతినిధుల, ఉపాధ్యాయుల సూచనతో పాటు విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఒప్పందం ముగిసినా పాఠశాలన కొనసాగింపునకు భవన యజమాని అంగీకరిస్తూ వస్తున్నారు. ఇటీవల పాఠశాల భవనాన్ని ఖాళీ చేసి వేరే చోట ఏర్పాటు చేసుకోవాలని సూచించడంతో ఉపాధ్యాయుల, విద్యార్థుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు, జిల్లా అధికారులతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులకు వివరించారు. వారు పాఠశాల యాజమానితో మాట్లాడి రెండు నెలల గడువు కోరారు. అప్పటి వరకు పాఠశాల నూతన భవనం నిర్మాణం పూర్తవుతుందని, అప్పటి వరకు పాఠశాల నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

భవన నిర్మాణానికి భూమిపూజ చేసి మూడేళ్లు పూర్తయినా...

విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.3.35 కోట్ల వ్యయంతో రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 2020 మార్చి 12న భూమి పూజ చేశారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో మూడేళ్లకు కేవలం గ్రౌండ్ ఫ్లోర్ పనులే పూర్తయ్యాయి. సకాలంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచడంతో మూడు నెలల క్రితం పనులు ప్రారంభం కావడం ముమ్మరంగా సాగుతుండటంతో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ పనులు, ఇటీవల గోడల నిర్మాణం పూర్తయింది. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

వచ్చే నెల ప్రారంభించేందుకు చర్యలు



ఇటీవలే ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. జూలై మొదటి వారంలో గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తి చేసి పాఠశాలకు అప్పగించాలని కోరాం. పనులు త్వరగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నాం జూలై మొదటి వారంలో ప్రారంభించి, విద్యార్థుల సమస్యను పరిష్కరిస్తాం.

– దశరథ్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు, కడ్తాల్.

పోలీసుల కృషితో తగ్గిన క్రైం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజల రక్షణకు 24 గంటల పాటు పోలీసులు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఖానాపూర్ సమీపంలోని గురుకుల విద్యాపీఠం నుంచి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన తెలంగాణ రన్‌ను డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీసుల కృషితోనే మన ప్రాంతంలో క్రైం రేట్ తగ్గిందన్నారు. అనంతరం డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులకు పోస్టులు పెట్టి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, ఆర్డీఓ వెంకటాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ కృపేశ్ పోలీసు అధికారులు, బీఆర్ఎస్ నేతలు, విద్యార్థులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కబ్జాదారులపై పీడీ యాక్టు నమోదు చేయండి

తుర్కయంజాల్: మాసబ్ చెరువు భూ కబ్జాదారులపై వాల్టా చట్టం క్రింద కేసులు చేసి పీడీ యాక్టు నమోదు చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పోలీసులను కోరారు. సోమవారం ఆయన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. 205 సర్వే నెంబర్‌లో మట్టి డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నిత్యం ఇద్దరు పోలీసులతో గస్తీ ఏర్పాటు చేయాలని ఏసీపీ ఉమామహేశ్వరరావు, సీఐ రవి కు మార్‌కు సూచించారు. కోర్టు ఉత్తర్వులను అడ్డంపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించిన కబ్జాదారుల ఆటలు సాగవని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలన్నారు. మొత్తం చెరువు విస్తీర్ణం 520 ఎకరాలకు గాను, ప్రస్తుతం 495 ఎకరాలుగా చూపిస్తున్నారని, హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చెరువును మొత్తం సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించాలన్నారు. ఎవరైతే డంప్ చేశారో వారి నుంచే డబ్బులను రికవరీ చేసి మట్టి తొలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేశ్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, నాయకులు లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, విజయానంద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్, సంపతీశ్వర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున కల్యాణం

ఇబ్రహీంపట్నం రూరల్: మల్లికార్జున స్వామి, కేతమ్మ, భ్రమరాంబ మాతల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పరిగూడలో ఆలయ ధర్మకర్తలు రాంరెడ్డి, నందారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి అర్జున్‌రెడ్డి, పోరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: తెలంగాణ రన్‌లో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, డీసీపీ శ్రీనివాస్

ఉత్సాహంగా 'తెలంగాణ రన్'



రన్‌లో సీఐ ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాంపాల్‌నాయక్, పత్యానాయక్ తదితరులు

ఆమనగల్లు: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆమనగల్లు పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన 2–కె రన్ ఉత్సాహంగా జరిగింది. పట్టణంలోని పోలీసు స్టేషన్‌ఆవరణలో ఈ రన్‌ను సీఐ ఉపేందర్ ప్రారంభించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక పట్టణంలోని పోలీసు స్టేషన్ నుంచి మార్కెట్ యార్డు, బస్టాండ్, పోస్టాఫీసు, ప్రభుత్వాసుపత్రి మీదుగా ఈ రన్ కొనసాగింది. ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్య, కడ్తాల ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, తలకొండపల్లి ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, సర్పంచ్‌లు సోన శ్రీనునాయక్, లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యులు కుమార్, పంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య



యాచారం: మొండిగౌరెల్లిలో ఉపాధ్యాయుల ర్యాలీ



ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో ..

యాచారం: వేసవి సెలవుల తర్వాత సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆయా గ్రామాల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య చాల తక్కువగా ఉంది. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం కింద గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బడీడు పిల్లలున్న తల్లిదండ్రులను కలిసి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. యాచారం, మొండిగౌరెల్లి, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, గునుగల్, మాల్, చింతపట్ల తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

'బడి బాట'కు ఉపాధ్యాయుల కృషి ప్రధానం

మంచాల: బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయుల కృషే ప్రధానమని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘం మండల ప్రధాన కార్యదర్శులు లలిత, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దండుమైలారంలో 'బడిబాట'

ఇబ్రహీంపట్నం: చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పాలని దండుమైలారంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 20వరకు బడిబాట ర్యాలీ నిర్వహించునున్నట్లు ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు తెలిపారు.

'పల్లెప్రగతి'ని విజయవంతం చేద్దాం

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



మాట్లాడుతున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 15న నిర్వహించే పల్లె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. సోమవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. 14న నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం, 15న నిర్వహించే పల్లెప్రగతి దినోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ మధు సూదనాచారి, ఏఈఈ శ్రావ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

మంచాల: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం పార్టీ నాయకులు ఎంపీడీఓ శ్రీనివాస్‌కు ఉద్యోగాలు భర్తీ చేయాలి, నిరుద్యోగ భృతి చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ, సత్తయ్య, రాములు, రాజు, లింగం గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు సురేశ్, విక్రమ్‌గౌడ్, నవీన్ గౌడ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న పండుగ

ఇబ్రహీంపట్నం రూరల్: మండలం పరిధిలోని జాజోనిబావి గ్రామంలో ఆదివారం మల్లన్న స్వామి పండగ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఐలయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట రాజేందర్, ముజాకీర్, స్వామి, శంకరయ్య ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న క్యామ మల్లేశ్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు చెందిన లచ్చంపేట నవీన్ కుమార్, 5వ వార్డుకు చెందిన పోలేపల్లి శంకరయ్య భార్య మంజులతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన పాలమోని లక్ష్మమ్మలు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ సోమవారం పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రేణుకాజగన్, అనాజీపూర్ సర్పంచ్ రంగయ్యముదిరాజ్, నాయకులు విజయేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన వెంకటయ్య(61) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమేశ్, అనిత, ఎల్లయ్య, రామచంద్రయ్య, జంగయ్య, యాదయ్య, శ్రీను, శ్రీశైలం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీ'జులుం' అరికట్టండి

యూత్ కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌గౌడ్



మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

కడ్తాల్: ప్రైవేట్ విద్యాసంస్థల విద్యావ్యాపారాన్ని అరికట్టాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్మిషన్ ఫీజు పేరిట ప్రైవేట్ విద్యాసంస్థలు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మౌలిక వసతులు కల్పించకుండా నోట్‌బుక్స్, యూనిఫామ్స్ తదితర ఫీజులను చూపుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారని మండిపడ్డారు. విద్యాధికారులు తక్షణమే స్పందించి ఆయా పాఠశాలల్లో తనిఖులు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మంకి శ్రీను, శ్రీకాంత్, భానుకిరణ్, రమేశ్ నాయక్, భరత్, చందు తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రకుంట'ను కాపాడండి

తహసీల్దార్‌కు ముదిరాజ్ సంఘం నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఎర్రకుంట చెరువు కబ్జాకు గురి కాకుండా చూడాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. చెరువు పరిసర ప్రాంత రైతులు కొందరు, చెరువులోకి వెళ్లకుండా చెరువు బాటను దున్ని కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చెరువుకు ఉన్న భూ విస్తీర్ణం ఎంత, ఎంత విస్తీరణంలో కబ్జాకు గురైంది, సర్వే చేయించి నిజ నిర్ధారణలు పరిశీలించి తగిన న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా సర్వే చేయించి పరిశీలించి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విట్టల్, శ్రీకాంత్, నరేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట

పండుగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం



ఇబ్రహీంపట్నం: విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: వేసవి సెలవులు ముగియడంతో సోమవారం ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. బడి గంట మోగడంతో విద్యార్థులు పుస్తకాలు చేతపట్టి బడిబాట పట్టారు. ఉపాధ్యాయులు పండుగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికారు. మొదటి రోజు ఆశించినంత స్థాయిలో విద్యార్థులు హాజరుకాలేదు. కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 50 ప్రభుత్వ పాఠశాలుండగా 26 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 14 ప్రభుత్వ ఉన్నత, ఒక్కో కేజీబీవీ, ఆదర్శ, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. సుమారు 5 వేల మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు.

టీచర్ల కొరత

కొత్త టీచర్ల నియామకం లేకపోవడంతో మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత నెలకొంది. గతేడాది టీచర్ల కొరతను అధిగమించేందుకు విద్యా వలంటీర్లను నియమించుకున్నారు.

అందుబాటులో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు

విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 80 శాతం పాఠ్యపుస్తకాల అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా యూనిఫాంలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



ఇబ్రహీంపట్నంరూరల్: ఎంపీపటేల్‌గూడలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయ బృందం



ఇంజాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో బోధిస్తున్న ప్రిన్సిపాల్



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

పిడుగుపాటుకు కాడెడ్లు మృతి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండాలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు రెండు కాడెడ్లు మృతిచెందాయి. తండాకు చెందిన ఆమనగల్లు సింగిల్‌విండో డైరెక్టర్, రైతు దోల్యానాయక్ తన కాడెడ్లను రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద ఉంచాడు. ఆదివారం రాత్రి పిడుగు పడటంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ చైర్మన్ సత్యం, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్‌లు సోమవారం బాధిత రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా వ్యక్తిగతంగా రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్‌లు వెంకటయ్య, శ్రీపాల్, రమేశ్, సీఈఓ దేవేందర్, స్థానికులు రమేశ్‌నాయక్, గన్యానాయక్, చంద్రు నాయక్, హీరాసింగ్, రవీందర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.